క్లుప్తంగా

రాపోలు నర్సింహకు పూల రవీందర్ పరామర్శ

మిర్యాలగూడ టౌన్ : గుండెపోటుకు గురై పట్టణంలోని రీవర్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ తండ్రి నర్సింహను మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట ఉపాధ్యాయ సంఘం నాయకులు గోపినాయక్, అంబటి శ్రీనివాస్, శ్రీనివాస్‌నాయుడు, రాపోలు హరిబాబు తదితరులు ఉన్నారు.

'కేఎన్‌ఎం'లో బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు



రక్త పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని కేఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మలిగిరెడ్డి భీమార్జున్‌రెడ్డి, ఎన్‌సీసీ సీటీఓ డాక్టర్ గుమ్మడి నరేష్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థుల సేవల్లో భాగంగా ఈ కార్యక్రమంలో చేపట్టామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బీఎం నాయుడు, కళాశాల ఉద్యోగి శేఖర్‌రెడ్డి,, క్లబ్ కార్యదర్శి కుటాల రాంబాబు, లింగయ్య, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

మిర్యాలగూడ అర్బన్ : ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు కోరారు. ప్రజా సమస్యల అధ్యాయన పోరుయాత్రలో భాగంగా బుధవారం మండలంలోని తడకమళ్ల, తక్కెళ్లపాడు గ్రామాల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. మండలంలో 13 హెల్త్ సబ్ సెంటర్లు ఉండగా వాటి భవనాలు కొన్ని ప్రారంభానికి నోచుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్, చౌగాని సీతారాములు, వెంకన్న, గుండు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

మిర్యాలగూడ అర్బన్: ఈవ్‌టీజింగ్ నిర్మూలన, సోషల్ మీడియాలో జరుగుతున్న ఘటనలపై బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని వాగ్దేవి హైస్కూల్ విద్యార్థులకు షీటీం పోలీసుల ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ నందిపాటి ప్రభాకర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది రవీందర్, చేగొండి మురళీయాదవ్, వాగ్దేవి స్కూల్ డైరెక్టర్ సోమగాని శ్రీనివాస్, ప్రిన్సిపాల్ భవ్య, వాజిద్, పద్మ, వాణి, వెంకరమణ, సరస్వతి, వసంత పాల్గొన్నారు.

ఎత్తిపోతలకు విద్యుత్ సరఫరా చేయాలి

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఎడమకాల్వపై ఉన్న ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం నిరంతరం విద్యుత్ సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం వేములపల్లి మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి కోరారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని విద్యుత్ డీఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గతంలో ఎత్తిపోతల పథకాలు నడిపేందుకు సబ్‌స్టేషన్ల నుంచి ప్రత్యేకంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారని, పాత పద్ధతి ప్రకారం విద్యుత్ అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు దుర్గా ప్రసాద్, సాంబశివారెడ్డి, భిక్షం, రాములు, లింగయ్య, వెంకటయ్య, లక్ష్మారెడ్డి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెమడాల పరశురాములు

మిర్యాలగూడ అర్బన్ : సూర్యాపేట- భీమవరం రోడ్డును గత పదేళ్లుగా పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామ మాజీ ఎంపీటీసీ రెమడాల పరశురాములు కోరారు. ఈమేరకు బుధవారం సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పనులు అసంపూర్తిగా వదిలేయడంతో ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనాలు దెబ్బతింటున్నాయని అన్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మరమ్మతులు చేపట్టాలి

డిండి: డిండి ప్రాజెక్టు మెయిన్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీలకు మరమ్మతులు చేపట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండి.మైనొద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్ని డిస్ట్రిబ్యూటరీలకు తలుపులు లేక కాలువ ద్వారా విడుదల చేసిన నీరు పొలాల మీదుగా వెళ్తుండడంతో వ్యవసాయ పనులకు ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు.

కార్యాలయాలపై 'సోలార్' ప్లాంట్లు

- భవనాల వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశం
- ప్లాంట్ల ఏర్పాటుకు సర్వే నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు
- ప్రభుత్వ ఆఫీసులకు తప్పనున్న విద్యుత్ బిల్లుల భారం



మున్సిపల్ కార్యాలయ భవనంపై కొలతలు తీస్తున్న సిబ్బంది

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని అన్ని ప్రభుత్వ కార్యాలయ భవనాలపై సౌర విద్యుత్ (సోలార్ పవర్) ప్యానెళ్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే జల, థర్మల్ విద్యుత్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి సౌర విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. తద్వారా విద్యుత్ ఆదాతోపాటు ప్రభుత్వ కార్యాలయాలకు కరెంట్ బిల్లుల భారం తగ్గించాలని యోచిస్తోంది. తాజాగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సౌర ప్లాంట్ల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు.

వారం రోజుల్లో నివేదిక అందించాలని ఆదేశం

అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, విద్యా సంస్థల భవనాలు, ఆసుపత్రులు, మార్కెటింగ్ శాఖ పరిధిలోని గిడ్డంగుల భవనాలపై రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్లాంట్లు ఏర్పాట్లకు అవసరమైన భవన వివరాల కోసం సర్వే చేయాలని, అందుకు ప్రశ్నావళిని వారంలోగా రూపొందించి పంపించాలని సూచించింది. ప్రభుత్వం భవనాలు ఏ మేరకు ఉన్నాయి, నెలకు ఎన్ని యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతుంది. ఎన్ని కిలోవాట్ల లోడు పడుతుంది. అనే వివరాలను తెలుసుకొని అందుకు తగ్గ సామర్థ్యం గల ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు.



సోలార్ ప్లేట్ల నమూనా

తక్కువ విద్యుత్ వినియోగం ఉన్న కార్యాలయాలకు ఎల్‌టీ సర్వీసు కింద విద్యుత్ వినియోగం ఎక్కువగా వినియోగించే భవనాలకు హెచ్‌టీ సర్వీస్ కింద ప్లాంట్లు బిగించనున్నారు.

ప్లాంట్ల ఏర్పాటు ఇక్కడే..

మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయం పరిధిలోని కళాభారతి (మినీ రవీంద్రభారతి, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సంతులాల్ సేవా భవనాలపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. అలాగే తహసీల్దార్, ఎంపీడీఓ, సబ్ కలెక్టర్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, ఎంఈఓ, ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రి భవనాలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తారు. తద్వారా ఎక్కడికక్కడ విద్యుత్‌ను ఉత్పత్తి చేసి సదరు కార్యాలయాలకు వినియోగించుకోవాలని, మిగిలిన విద్యుత్‌ను డిస్కంకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. డిస్కం వారు తీసుకున్న విద్యుత్‌ను వినియోగదారులకు అందించనున్నది.

ప్రభుత్వ భవనాలను సర్వే చేస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సర్వే చేస్తున్నాం. సర్వే అనంతరం ఎన్ని కిలోవాట్ల సామర్థ్యంగల సోలార్ ప్లాంట్లు అవసరమో ప్రతిపాదనలను రూపొందించి కలెక్టర్‌కు నివేదిస్తాం.

– బి.వెంకన్న, మున్సిపల్ డీఈఈ, మిర్యాలగూడ

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



పెద్దఅడిశర్లపల్లి : మార్నింగ్ వాక్‌లో భాగంగా భీమనపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం గుడిపల్లి మండలంలోని భీమనపల్లి, కోదండాపురం గ్రామాల్లో మార్నింగ్ వాక్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారానికి మార్నింగ్ వాక్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్గూరి మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ముచ్చర్ల ఏడుకొండల్ యాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, కుక్కల గోవర్ధన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంసింగ్‌నాయక్, హరికృష్ణ ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెద్దఅడిశర్లపల్లి : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం మండలంలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 7- బి కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. కార్యక్రమంలో ఏఎమ్మార్పీ ఈఈ సత్యనారాయణ, డీఈ నాగయ్య, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ కాంప్లెక్స్ షాపులకు బహిరంగ వేలం వేయాలి



మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అంజేస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాఅలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణం సాగర్ రోడ్డులో గల ఎన్‌టీఆర్ కాంప్లెక్స్‌లోని గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ షాపులకు బహిరంగా వేలం వేయాలని బీజేపీ వన్ టౌన్ అధ్యక్షుడు బంటు గిరి కోరారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్‌టీఆర్ కాంప్లెక్స్ గ్రౌండ్ ఫ్లోర్ షాపులకు 2005లో అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు బహిరంగ వేలం వేసి అలాట్ చేశారన్నారు. ఆ తరువాత 2018లో తిరిగి 66 షాపులకు టెండర్లు వేసి ఓపెన్ చేసినా నేటికీ అలాట్ చేయలేదన్నారు. వినతి పత్రాన్ని అందజేసినన వారిలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సజ్జల నాగిరెడ్డి, బంటు సైదులు, కనపర్తి సత్యప్రసాద్, రేపాల పురుషోత్తంరెడ్డి, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, చిల్లంచర్ల అభి, లక్ష్మారెడ్డి, పులి విద్యాసాగర్, చిలుకూరి శ్యాం, కంచుకొమ్ముల వేణు, ప్రధాన కార్యదర్శులు కొంగరి వెంకటరమణ, మూల రాజీరెడ్డి, నక్క రవిబాబు, నక్క శ్రీను, బొట్టు సోములు, దైద రవి, దైద సోములు తదితరులు ఉన్నారు.

వృద్ధుడి అవయవాలు దానం



తెలుసూరి అంజయ్య (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన వృద్ధుడి అవయవాలను కుటుంబ సభ్యుల అనుమతి మేరకు బుధవారం జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు సేకరించారు. మిర్యాలగూడ పట్టణంలోని నాగార్జుననగర్ కాలనీకి చెందిన రైతు తెలుసూరి అంజయ్య(69)ను ఇటీవల ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా బ్రెయిన్ డెడ్ అయ్యింది. ఆస్పత్రి వర్గాల సమాచారంతో జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు అంజయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయదానం ప్రాముఖ్యతను వివరించారు. దీంతో అతడి కుటుంబ సభ్యుల అనుమతితో అంజయ్య శరీరం నుంచి లివర్, రెండు కార్నియాలను సేకరించి మరో ముగ్గురు వ్యక్తులకు అమర్చినట్లు జీవన్‌దాన్ సందస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్యపరీక్షలు

హాలియా : వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం హాలియా మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, టీఎంసీ పద్మ, మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హాలియాలో కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రామకృష్ణ

ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు తప్పనిసరి



పెద్దవూరలో రికార్డులను పరిశీలిస్తున్న ఏటీడీఓ ఎం.శ్రీనివాసులు

పెద్దవూర : ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు తమ హాజరును ఫేస్ రికగ్నిషన్ ద్వారా నమోదు చేయాలని జిల్లా సహాయ గిరిజన అభివృద్ధి అధికారి(ఏటీడీఓ) ఎం.శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన పెద్దవూర ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల, ఎస్టీ రెగ్యులర్ హాస్టల్, ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలు, రికార్డులు, వంటగది, మూత్రశాలలు, వసతి గృహ పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం డి.బాలోజీ, వార్డెన్లు కొల్లు బాలకృష్ణ, అహల్య, సుధాకర్, జైపాల్, ఉపాధ్యాయులు కూన్‌రెడ్డి రాంరెడ్డి, బి.కృష్ణ, సంధ్య, శ్రీనునాయక్, సురేందర్, షాహీన్‌బేగం, శాంతి, శివలీల, ఏఎస్‌ఎం జ్యోతి, సిబ్బంది కమలబాయి, నాగేందర్, లింగయ్య, రాము తదితరులు ఉన్నారు.

బంకాపురం రోడ్డులో హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలి



వర్షాలకు దెబ్బతిన్న బంకాపురం లోలెవల్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నిడమనూరు : నిడమనూరు–బంకాపురం రోడ్డులో హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. వర్షాలకు దెబ్బతిన్న బ్రిడ్జిని బుధవారం వారు పరిశీలించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చిన్నపాలక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. లో లెవల్ బ్రిడ్జితో బంకాపురం, వెనిగండ్ల, సూరేపల్లి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా నిడమనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పలువురు ఉద్యోగులు విధులకు గైర్హాజరవుతున్నారని, కొత్త ఆస్పత్రి నిర్మించినా వైద్యసేవలందించడంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందూకూరి కోటేష్, నల్లబొతు సోమయ్య, వింజమూరి శివ, కుంచెం శేఖర్, మహేష్, బాలనారాయణ, ముత్యాలు, కేశవులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



హాలియాలో బొడ్రాయి వద్ద మొక్కులు తీర్చుకుంటున్న కుందూరు వెంకట్‌రెడ్డి



శాఖాపురం గ్రామంలో బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న మహిళలు

హాలియా : మున్సిపాలిటీ కేంద్రంలో బుధవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా హాలియా పట్టణ మహిళలు బోనాలతో వచ్చి గ్రామ దేవతలు ముత్యాలమ్మ, బొడ్రాయి వద్ద బోనాలు సమర్పించారు. హాలియా పట్టణ పెద్దకాపు కుందూరు వెంకట్‌రెడ్డి బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కుందూరు రాజేందర్‌రెడ్డి, కుందూరు శ్యాంసుందర్‌రెడ్డి, పిల్లి అంజనేయులు, తక్కెళ్ళపల్లి సైదులు, కృష్ణారెడ్డి, పాండునాయక్, ముజ్జ శివరామయ్య, చిందే లక్ష్మణ్, పాంపాటి శ్రీనివాసులు, చెరుపల్లి ముత్యాలు, వర్కాల శ్రీనివాస్‌రెడ్డి, నకిరేకంటి సైదులు, వెంకట్‌రెడ్డి, నామని సుధాకర్, దండ రామిరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస బోనాల సందడి

నిడమనూరు : శ్రావణ మాసం సందర్భంగా నిడమనూరు, శాఖాపురం గ్రామాల్లో బుధవారం బోనాల పండుగ నిర్వహించారు. ముత్యాలమ్మ, బొడ్రాయి, ఈదమ్మ దేవతలకు బోనాలు సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో యాదవ సంఘం పెద్దలు, మాజీ సర్పంచ్ బొల్లం బాలయ్య, సైదులు, శేషరాజు దాసు, అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, మెరుగు మధు, పంతులు తుకారం, బొజ్జ పుల్లయ్య, ఉన్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ వాసికి డాక్టరేట్



అనుకరణ

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన కడారి అనుకరణకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎడ్యుకేషన్ విభాగంలో 'మ్యాథమేటికల్ ఆటిట్యూడ్ అండ్ ప్రాబ్లం సాల్వింగ్ ఎబిలిటీ ఎమాంగ్ సెకండరీ స్కూల్ స్టూడెంట్ ఆన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై ప్రొఫెసర్ సునిత పర్యవేక్షణలో ఆమె పరిశోధన గ్రంథం సమర్పించారు. దీంతో ఓయూ 84వ కాన్వకేషన్ కార్యక్రమంలో ఇటీవల గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, వైస్ చాన్సలర్ కుమార్ చేతుల మీదుగా అనుకరణ డాక్టరేట్‌ను అందుకున్నారు. ప్రస్తుతం అనుకరణ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం గుడుగుంట్లపాలెం(చిల్లేపల్లి) బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా అనుకరణ మాట్లాడుతూ మా స్వంత గ్రామం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇల్లందు కాగా తన అత్తగారు ఊరైన మిర్యాలగూడ బంగారుగడ్డలో నివాసం ఉంటున్నామని తెలిపారు. తన భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం వల్లే డాక్టరేట్ వచ్చిందని, చాలా ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా కుంకుమార్చన

పెద్దవూర: మండల కేంద్రంలోని శ్రీదుర్గా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో బుధవారం కొండమల్లేపల్లి ఆర్యవైశ్య సంఘం, వడి బియ్యం సంఘాల ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వడిబియ్యం పోశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సుమన్‌మోహన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

వేములపల్లి: నానో యూరియా, డీఏపీ వాడకంతో అధిక దిగుబడులు సాధించవచ్చని వేములపల్లి మండల వ్యవసాయాధికారి కిశోర్‌నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగంలో నానో యూరియా అద్భుత ఫలితాలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నితిన్‌నాయక్, రమేష్‌నాయక్, సీఈఓ రవీందర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక లాభాలు

మాడుగులపల్లి : రైతులు నానో యూరియా వాడడంతో అధిక లాభాలు పొందవచ్చని మాడుగులపల్లి ఏఓ శివరాంకుమార్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రైతులు నానో యూరియా, డీఏపీని తాము సాగు చేస్తున్న పంటలపై స్ప్రే చేసినట్లయితే అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్‌ను రద్దు చేయాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండల పరిధిలోని సుంకిశాల తండా నుంచి చందూరు మండల పరిధిలోని బోడంగిపర్తి పాఠశాలకు ఎలాంటి ఉత్తర్వులు లేకుండా అక్రమంగా డిప్యుటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయురాలిని సొంత స్థానంలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఎంఈఓ కొనమంచిలి శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఎరనాగుల సైదులు, వినయ్‌కుమార్, రాజేష్, అమరయ్య, సత్యనారాయణ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా అనుదీప్‌రాజు

మిర్యాలగూడ అర్బన్: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వట్టెపు అనుదీప్‌రాజును నియమిస్తూ ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రవి శంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం మిర్యాలగూడ పట్టణంలో జరిగిన సమావేశంలో నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కోశాధికారి పుట్టల దినేష్, నాయకులు రాజేంద్ర ప్రసాద్, విష్ణు, సందీప్, ప్రశాంత్, గోవిందు, రాజేష్, గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్
- ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి



మిర్యాలగూడ : నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ : దివంగత మాజీ ప్రధానిరాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హాజరై రాజీవ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశంలో శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొచ్చి ప్రపంచ దేశాలతో పోటీపడేలా చేసిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారంలోకి తీసుకొచ్చేలా ప్రతి కార్యకర్త కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పైలాన్ కాలనీ గాంధీ బజార్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఓబీసీ పట్టణ అధ్యక్షుడు జంగయ్య, వేణు, సత్యనారాయణరెడ్డి, ముజీబ్, జైరాం, చంద్రకాంత్, నాగరాజు, సలీం, నర్సింహ, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాజీవ్ గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాయిని మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, యుగంధర్‌రెడ్డి, మాడ్గుల యాదగిరి, జగదీష్‌పటేల్, పాల్గొన్నారు.

22న గ్రామాల్లో పనుల జాతర

నల్లగొండ : గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఈ నెల 22న పనుల జాతర నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 18 రకాల పనులకు సంబంధించి జాతర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పనుల జాతరను ప్రజాప్రతినిధుల ద్వారా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ కింద వ్యక్తిగత లబ్ధిదారులకు చెందిన కనీసం ఒక పనిని ఈ నెల 22న శంకుస్థాపన చేయాల్సి ఉంటుదని తెలిపారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

హాలియా : హాలియా సర్కిల్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ సాయి ప్రశాంత్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో వినాయ మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ప్రతిరోజు సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

అనుమతులు లేని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని దేవరకొండ, కొండమల్లేపల్లి పట్టణాల్లో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీష్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం దేవరకొండ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో కొందరు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులు, యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని అన్నారు. సమావేశంలో తోటపల్లి మల్లేష్, ధనరాజ్, సత్యం, సిద్ధు, మహేష్, గోపి, తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



ఎస్టీ హాస్టల్‌కు వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



యల్లాపురంలో ప్రధాన రోడ్డు పక్కనే కంచె లేకుండా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలో పలుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్డు పక్కనే కంచె లేకుండా ఉండడంతో మూగజీవాలు విద్యుదాఘాతానికి గురవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.